అధునాతన గ్రంథాలయ నిర్మాణానికి కృషి

మాట్లాడుతున్న రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

వనస్థలిపురం, జనవరి 18 : ఎన్జీవోస్ కాలనీలోని గ్రంథాలయాన్ని అత్యాధునికంగా, అన్ని వసతులతో నిర్మిస్తామని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. అనువైన స్థలం ఉన్నందున నూతన భవనం నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అందులో డిజిటల్ లైబ్రరీని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఉగాది పండుగ లోపే పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరప్ప, జైపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వర్ధిని, వెంకటేశం, ఓం ప్రకాశ్, నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, పీవీకే సోమయాజులు, మనోజ్‌కుమార్, సీహెచ్‌వీఆర్‌కే మూర్తి, హరిబాబు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవలు ఐక్యతకు మార్గం

మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణారవీందర్ రెడ్డి

సైదాబాద్, జనవరి 18 : సామూహిక ఆధ్యాత్మిక, భజన కార్యకమాలతో సమాజంలో శాంతి, సోదర భావాలను పెంచుతాయని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి అన్నారు. శనివారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఎస్బీహెచ్-సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన భజానంద సమూహ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారానే ప్రజల మధ్య ఐక్యత, సౌభ్రాతృత్వాలు పెంపొందటంతో భగవంతుని అనుగ్రహం పొందవచ్చన్నారు. మహిళలంతా ముందుకు వచ్చి ఇటువంటి కార్యక్రమాలను రూపొందించటం ఆనందదాయకమని, నిర్వాహకులకు తన సహకారం ఎల్లప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జయశ్రీ లోహార్కర్, రోహిణి జోషి, నేతాపులివార్, లక్ష్మీబాయి జోషి, నేతాలి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలి

ఉప్పల్, జనవరి 18: బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసేలా చూడాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారం అంబేద్కర్ విగ్రహం సమీపంలో నిర్మించనున్న బ్రిడ్జి పనులకు సంబంధించి నాలా డైవర్షన్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి.

రైతు భరోసాపై అవగాహన

రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

బడంగ్‌పేట,జనవరి18: వ్యవసాయానికి పనికిరాని భూముల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి బాలాపూర్ తాసీల్దార్ ఇందిరా దేవికి, డీటీ మహిపాల్ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం బాలాపూర్ రెవెన్యూ అధికారులకు రైతు భరోసా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రికార్డులను, లే అవుట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీ లో లే అవుట్లు చేసిన తర్వాత కూడా ఇంకా వ్యవసాయ భూములుగా కొనసాగుతున్నట్లు తెలిస్తే వాటిని రికార్డుల నుంచి తొలగించాలన్నారు. వ్యవసాయానికి పనికి రాని గుట్టలు, చెట్లు ఉన్న భూములను గుర్తించాలన్నారు. బాలాపూర్ మండలంలో మైనింగ్‌కు కేటాయించిన భూముల వివరాలను సేకరించాలన్నారు. మైనింగ్ భూములకు పాస్ పుస్తకాలు ఉంటే రద్దు చేయాలన్నారు. లే అవుట్లు చేసిన రియల్ ఎస్టేట్ భూములు ఎన్ని ఉన్నాయో వాటిని గుర్తించాలన్నారు. వెంచర్లు చేసిన తర్వాత కూడా రికార్డులలో మారకపోతే రికార్డుల నుంచి తొలగించాలన్నారు. ప్లే గ్రౌండ్స్, పార్కులు, రోడ్ల వివరాలను తీసుకొని అవి రికార్డుల నుంచి తొలగించారా లేదా అనేది చూడాలన్నారు. మండలంలో పరిశ్రమలకు ఎన్ని ఎకరాలు కేటాయించారో వాటి వివరాలను పరిశీలించాలన్నారు. గోదాములకు కేటాయించిన భూముల వివరాలను తీసుకోవాలన్నారు. వెంచర్ చేసిన తర్వాత కూడా పాస్ పుస్తకాలు ఉంటే రికార్డుల నుంచి తొలగించాలన్నారు. కళాశాలలు, స్కూల్స్, ప్లే గ్రౌండ్స్ చేసిన తర్వాత వ్యవసాయ భూమిగా రికార్డులలో ఉంటే క్షేత్ర స్థాయిలో పరిశీలించి రికార్డుల నుంచి తొలగించాలన్నారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తాసీల్దార్ ఇందిరా దేవి ఆధ్వర్యంలో జల్‌పల్లి, మామిడిపల్లిలో ఉన్న లే అవుట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వివరాలను సేకరించడానికి అధికారులు సిద్ధమయ్యారు.

ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎలాంటి ప్రమాదాలు లేకుండా డ్రైవింగ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్లను సన్మానిస్తున్న ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య

మలక్‌పేట, జనవరి 18: ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పక పాటించాలని ఈస్ట్‌జోన్ ఆర్టీవో కిష్టయ్య సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం మూసారాంబాగ్‌లోని ఈస్ట్‌జోన్ ఆర్టీవో కార్యాలయంలో దిల్‌సుఖ్‌నగర్, మిధాని, కాచిగూడ డిపోలకు చెందిన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను పాటించటం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. నిత్యం ప్రజా రవాణా విధులను నిర్వహించే ఆర్టీసీ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను పాటించటం ద్వారా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చవచ్చునని అన్నారు. అధిక వేగం, సిగ్నల్ జంపింగ్, రాంగ్‌రూట్లో వెళ్లటం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపటం, సీటు బెల్టు ధరించకుడా డ్రైవింగ్ చేయటం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయటం, ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపై తిప్పటం వంటివి అన్ని ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన కిందకే వస్తాయని, మోటార్ వెహికిల్ యాక్ట్ 1988, 2019ల ప్రకారం చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనకు పాల్పడితే లైసెన్సులు రద్దుచేసి కేసులు నమోదుచేయించి జరిమానలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. అతివేగం ప్రమాదకరమని, స్పీడ్ థ్రిల్ నిస్తుందని, కాని కిల్ కూడా చేస్తుందని ఆయన వివరించారు. ప్రమాదకరంగా డ్రైవింగ్ చేసేముందు ఒక్కసారి మీపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు. ప్రతి వాహనానికి ఫిట్‌నెస్, పర్మిట్లు, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పనిసరని ఆయన అన్నారు. 33 ఏండ్లుగా జీరో యాక్సిడెంట్(ఎలాంటి ప్రమాదాలు లేకుండా) డ్రైవింగ్ చేస్తున్న దిల్‌సుఖ్‌నగర్, మిధాని, కాచిగూడ డిపోలకు చెందిన డ్రైవర్లను ఈ సందర్భంగా ఆర్టీవో కిష్టయ్య, అధికారులు శాలువాలతో సన్మానించారు. ఎంవీఐలు రమేశ్‌బాబు, రాధిక, నరేంద్రపాల్, బలరాం, ఏఎంవీఐలు మధుసూదన్‌రెడ్డి, జాన్, అష్ఫాక్ అహ్మద్, ఏఓలు అంజుం, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది విమలాకుమారి, శైలజ, అరుణ్, శ్రీకాంత్, వినయ్, ఎంఏ కరీం, అరుణ, విజయ పాల్గొన్నారు.

పార్కు ఓపెనింగ్‌కు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం అందజేసిన డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

బడంగ్‌పేట, జనవరి18: మీర్‌పేట 28వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కు ఓపెనింగ్‌కు రావాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి ఆహ్వానం అందజేశారు. మీర్‌పేటలో చెరువులు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఎమ్మెల్యే కృషితోనే ఏర్పాటు చేసినవి అని అన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి అయిందంటే సబితా ఇంద్రారెడ్డి చొరవ అన్నారు. ఈనెల 20న పార్కును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

లక్ష్మీనగర్ కాలనీలో ట్రిపుల్ ఆర్ సెంటర్ ప్రారంభం

ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత

సైదాబాద్, జనవరి 18 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీ పార్క్‌లో శనివారం ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను కార్పొరేటర్ జంగం శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ వాసులు తమ ఇండ్లలో ఉన్న ఉపయోగం లేని వస్తువులు ఇక్కడ అందజేస్తే అవసరమైన వారికి వాటిని అందిస్తారని అన్నారు. చార్మినార్ జోన్ శానిటేషన్ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్, డీఈ వెంకటరాజు, శానిటేషన్ ఎస్సీ అర్జున్, ఎస్సీ ఫక్రుద్దీన్, యూసీడీ సీవో యాదయ్య, జవాన్ కృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగుల భూములను కబ్జా నుంచి కాపాడాలి

మాట్లాడుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

కందుకూరు, జనవరి 18 : దివ్యాంగులకు న్యాయం చేయాలని దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్ రావు కోరారు. మండల పరిధిలోని తిమ్మాయిపల్లిలో దివ్యాంగుల భూములను కబ్జా నుంచి కాపాడాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన దివ్యాంగులు దివంగత ఎడ్ల జంగయ్య కూతుర్లు పద్మావతి, హైమావతి, పరమేశ్వరి, రామేశ్వరిల 9,16ఎకరాల భూమిని 20సంవత్సరాలుగా అదే గ్రామానికి చెందిన బావ గొర్లెంకల యాదయ్య, అన్న క్రిష్ణయ్యలు కబ్జాలో ఉంటున్నారని తమ భూములు తమకు ఇవ్వాలని అడిగితే దౌర్జన్యానికి పాల్పడుతున్నట్లు తెలిపారు. వికలాంగుల భూములు కాజేయడానికి యత్నిస్తున్న, బావ, అన్నలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారి భూములను వారికి అప్పగించాలని కోరారు. వైస్ చైర్మన్ రాంబాబు, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి ప్రధాన కార్యదర్శి ముత్యాలు మాదిగ, యాచారం జంగయ్య, సలీం, రాజు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కందుకూరు, జనవరి 18 : సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిదని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొత్తగూడ గ్రామానికి చెందిన మల్లయ్యకు మంజూరైన చెక్కును మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని కొత్తగూడలో గల ఆయన ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు సోషల్ మీడియా కన్వీనరు బొక్క దీక్షిత్‌రెడ్డితో కలిసి అందజేశారు.

పేదలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేదునూరు, సరస్వతిగూడ, పులిమామిడి గ్రామానికి చెందిన ఇరువురు చొప్పున బేగరి కంచె గ్రామానికి చెందిన ఒకరికి మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ తో పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, డైరెక్టరు వెంకట్ రాంరెడ్డి,ఆనేగౌని పాండుగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, సరికొండ జగన్, నర్సింహచారి, బుక్క పాండురంగారెడ్డి,మహేందర్, శేఖర్, యాదగిరి,నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బాధితులు పాల్గొన్నారు.

శిల్పకు అభినందనలు

మలక్‌పేట, జనవరి 18: మలక్‌పేట పీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే పోటీ పరీక్షలు రాసి విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించింది ఓ మహిళా కానిస్టేబుల్. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మునగనూర్ గ్రామ నికి(తుర్కయంజాల్ మున్సిపాలిటీ) చెందిన శిల్ప 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. ఓ వైపు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూనే మరోవైపు పోటీ పరీక్షలకు ప్రిపేరై విద్యాశాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని సాధించారు. అయితే తాను జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగంలోనే కొనసాగుతానని అధికారులకు అర్జీ పెట్టుకోవటంతో శనివారం మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్ శిల్పను రిలీవ్‌చేస్తూ లెటర్‌ను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నరేశ్ మాట్లాడుతూ ఏ ఉద్యోగం చేసినా అంకితభావంతో పనిచేసి చేస్తున్న సంస్థకు, ఉద్యోగానికి వన్నె తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఐఐసీటీ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బండారి

ఉప్పల్: హబ్సిగూడలోని ఐఐసీటీ కార్యాలయంలో డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. హబ్సిగూడ నుంచి నాచారం వెళ్లేదారిలో ఇరువైపుల ఐఐసీటీ కార్యాలయం గోడల మధ్య రోడ్డు ఇరుకుగా ఉందని, దీనితో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత సమస్య పరిష్కారానికి తమవంతు తోడ్పాటు అందించేలా చూడాలని కోరారు. నాయకులు సాయిజెన్ శేఖర్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

పారా త్రోబాల్ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

చింటూరెడ్డిని సన్మానిస్తున్న సహారాస్టేట్స్‌కాలనీ రెడ్డి సంఘం ప్రతినిధులు

మన్సూరాబాద్, జనవరి 18: పారా త్రోబాల్ క్రీడలో రాణిస్తూ అంచెలంచెలుగా ఎదిగి భారత జట్టులోకి ఎంపికైన దివ్యాంగ క్రీడాకారుడికి ఆర్థిక సహాయం అందించేందుకు మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారా స్టేట్స్‌కాలనీ రెడ్డి సంఘం ముందుకు వచ్చింది. సహారాస్టేట్స్‌కాలనీ కాంప్లెక్స్‌లోని సహారా రెడ్డి సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో దివ్యాంగ క్రీడాకారుడు చింటూరెడ్డికి రూ. 21 వేల ఆర్థిక సహాయం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహారా స్టేట్స్ కాలనీ రెడ్డి సంఘం అధ్యక్షుడు మల్లు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పారా త్రోబాల్ క్రీడలో విశేషంగా రాణిస్తున్న దివ్యాంగుడైన చింటూరెడ్డి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుని దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. మార్చి 28 నుంచి 30 వరకు కొలంబియాలోని ఫినోమ్ ఫెన్‌లో జరుగనున్న మొదటి ఏషియన్ పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే భారతజట్టులో చింటూరెడ్డికి స్థానం లభించడం ఎంతో హర్షణీయమన్నారు. పారా క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పేరువాల జగత్‌రెడ్డి, కోశాధికారి మారెడ్డి రామకృష్ణారెడ్డి, లీగల్ అడ్వైజర్ రాఘవరెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సోమిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పని దినాల్లో సినిమా షూటింగ్

పాఠశాల పని దినాల్లో వీఎం హోంలో జరుగుతున్న సినిమా షూటింగ్

ఆర్కేపురం, జనవరి 18 : పాఠశాల పని దినాల్లో సినిమా షూటింగ్‌లకు అక్రమంగా అనుమతి ఇచ్చి విద్యార్థుల హక్కులకు భంగం కలిగించిన వీఎం హోం కార్యదర్శి కిషన్, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, ప్రిన్సిపాల్ భాస్కర్‌ను సస్పెండ్ చేయాలని వీఎం హోం పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భీమగాని మహేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. అక్రమ సంపార్జన కోసం విద్యార్థుల చదువులు ఫణంగా పెట్టడం, బాలల హక్కులకు భంగం కలిగించిన విషయంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సభ్యులు అంజన్‌రావు, షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఎం హోంలో యథేచ్ఛగా బాలల హక్కుల ఉల్లంఘన జరుగుతుందని చెప్పారు. పాఠశాల పని దినాల్లో షూటింగ్‌లకు అనుమతి ఇవ్వడం వల్ల తరగతి గదులు, ఆవరణ మొత్తం సినిమా షూటింగ్ బృందం తీసుకుని కనీసం పిల్లలను బాత్రూంలకు కూడా రానివ్వకుండా చేయడం దారుణమన్నారు. వీఎం హోం కార్యదర్శి తన బంధువులను సిబ్బందిగా నియమించుకోవడం, కొనుగోలు టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారని సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. సినిమా షూటింగ్ సిబ్బందికి 12గంటలు అనుమతి ఇచ్చి 24 గంటలు సినిమా షూటింగ్ జరిగిన, పిల్లలకు న్యూసెన్స్ జరుగుతున్న కేవలం అక్రమ సంపార్జన కోసం వీఎం హోం సూపరింటెండెంట్ అడ్డు చెప్పడం లేదన్నారు. అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సహాయక కార్యదర్శి కేతావత్‌సాగర్, ఉపాధ్యక్షుడు రాజు, తిరుపల్లి భాస్కర్, వినయ్, విఠల్, గణేశ్, పల్లె వినయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ

ఎమ్మెల్యే కాలేరుకు జ్ఞాపికను అందజేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

కాచిగూడ,జనవరి 18:కేవలం తొమ్మిదిన్నర ఏండ్ల కాలంలోనే మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో తెలంగాణ రాష్ర్టాన్ని అభివృద్ధి చేసి,దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలిపారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం కాచిగూడలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలేరు హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను తిర్చాలేక... పదేండ్లు మంత్రిగా పనిచేసి మచ్చలేని నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్‌పై పసలేని కుట్ర పూరితమైన కేసులు పేడుతున్నారని ఆరోపించారు.భూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని అమలు చేయక పోవడంతో ప్రజలు కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొడుతున్నారని అన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలను చేపట్టిన బీఆర్ఎస్ పార్టీని రానున్న సర్పంచ్,ఎంపీటీసీ,జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిపించడానికి ప్రజలు సంసిద్ధులై ఉన్నారని, మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగపరుచుకున్న లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, బబ్లూసింగ్, రమేశ్, శేషు,అంటో పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీతో మోసం..

విదేశీయుడి అరెస్ట్

హయత్‌నగర్, జనవరి 18: నకిలీ కరెన్సీతో మోసానికి పాల్పడుతున్న ఓ విదేశీయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కమరూన్ దేశానికి చెందిన జాక్యూస్ దేవలాఇస్ కిట్ 2017 జూలైలో రెండు నెలల టూరిస్ట్ వీసాపై భారతదేశానికి వచ్చాడు. అనంతరం స్వదేశానికి వెళ్లకుండా అతడి స్నేహితుడి పాస్‌పోర్టుపై కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఉన్నాడు. లైవ్‌హుడ్ కోసం నకిలీ కరెన్సీ వ్యాపారం చేస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. జాక్యూస్ దేవలాఇస్ కిట్ అసలు కరెన్సీని పొందిన తర్వాత వారిని మోసం చేసి అక్కడి నుంచి తప్పించుకునేవాడు. 2020లో బెంగుళూరులో ఇదే తరహాలో వ్యాపారం చేస్తుండగా కర్ణాటక పోలీసులు అతడిని పట్టుకుని హున్నూరు పీఎస్‌లో కేసు నమోదు చేశారు. 420 ఐపీసీ, విదేశీయుల చట్టం 1946లోని 14 కింద అతడిని రిమాండ్‌కు తరలించారు. అదే పద్ధతిలో హయత్‌నగర్‌లోని చైత్ర ఒయో లాడ్జిలో రసూల్‌ను మోసం చేస్తుండగా హయత్‌నగర్ పోలీసులు జాక్యూస్ దేవలాఇస్ కిట్ ను పట్టుకున్నారు. నిందితుడి వద్ద పాస్‌పోర్టుతోపాటు మొబైల్, 4 ఐదువందల ఒరిజినల్ కరెన్సీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పరీక్షలను పండుగలా జరుపుకోవాలి

మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ జ్యోత్స్నారాణి

సైదాబాద్, జనవరి 18 : మలక్‌పేట ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ్‌ను శనివారం ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ జ్యోత్స్నా రాణి సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పరీక్షలను పండుగలాగా జరుపుకోవాలని, ధైర్యంతో సంసిద్ధం కావాలని, మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. విద్యార్థినులు తమ తల్లిండ్రులకు, కాలేజీకి, చదువులు చెప్పిన అధ్యాపకులకు పేరుప్రతిష్టలు తీసుకురావాలన్నారు. కాలేజీలో రికార్డులను పరిశీలించి, అధ్యాపకులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠధామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం

పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్, జనవరి 18 : డివిజన్‌లోని వైకుంఠధామాల్లో సమస్యలను పరిష్కరిస్తామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. చిలుకానగర్ డివిజన్‌లో మైనార్టీ, కురుమ, రెడ్డి వైకుంఠధామాల పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అన్నికులాల వైకుంఠధామాలకు నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఈ వెన్నలగౌడ్, ఏఈ వినీత్‌రావు, నాయకులు బన్నాల ప్రవీణ్, ఏదుల కొండల్‌రెడ్డి, కొకొండ జగన్, శ్రీనివాస్, అశోక్‌చారి, సుందర్, శ్యామ్, అప్సర్, రాజ్యలక్ష్మి, ఆండాలు, సత్యవతి, లక్ష్మి,శారద, ఉమా, జయమ్మ, అబ్బుబాయి, మహమూద్, మజీద్, నీజర్, అలి, హసేన్, అలీముద్దీన్, వెంకటేష్, కృష్ణ, హనుమంతు, రఘు, ఐలయ్య, ఎర్ర శ్రీనివాస్, చంద్రారెడ్డి, వీరారెడ్డి, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

చర్లపల్లి, జనవరి 18 : ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఐజీ మింట్ హైదరాబాద్ యూనిట్ చీఫ్ జనరల్ మేనేజర్ సునీల్ తివారి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సెక్యూరిటీ, ప్రింటింగ్, మిటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఐజీ మింట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ పఖ్వాడ కార్యక్రమాన్ని చేపట్టి చర్లపల్లి చెరువు వద్ద ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం ప్రధాని మోదీ ఆదేశాల మేరకు అధికారులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ అదనపు జనరల్ మేనేజర్లు బాలాజీ, గంధం, జాయింట్ జనరల్ మేనేజర్ శైలేష్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ అతీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్‌లతో పాటు వివిధ విభాగాల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.